రోడ్డు విస్తరణ జరిగేనా?

కలగానే వంద ఫీట్ల రోడ్డు పనులు

- భారీగా పెరిగిన వాహనాల రాకపోకలు
- నిత్యం రద్దీతో వాహనదారుల ఇబ్బంది

బండ్లగూడ: శరవేగంగా విస్తరిస్తున్న నగర శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలూ అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనదారుల తోపాటు పాదచారులూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంచనాలకు మించి పెరుగుతున్న వాహనాలకు అనుగుణంగా రోడ్లను విస్తరించకపోవడం కూడా ట్రాఫిక్ సమస్యలతోపాటు ప్రమాదాలకూ కారణం అవుతోందని పాదచారులు, వాహనదారులు, స్థానికుల్లో సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అందుతున్నాయి.

- బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కిస్మత్‌పూర్ నుంచి బండ్లగూడ చౌరస్తా వరకు, పర్మాయిస్ హోటల్ నుంచి కేంద్రీయ విహార్ వరకు రోడ్డు విస్తరణ పనులపై సందిగ్ధత నెలకొంది. విస్తరణ పనులు జరిగేనా అని అనుమానాలూ లేకపోలేదు. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు లభిస్తుందా అని స్థానికులు,


ఇరుకు రోడ్డులో వాహనాలు


బండ్లగూడ ముఖ్య కూడలి వద్ద...

వాహనదారులు ఎదురు చూస్తున్నారు.

వేలాదిగా వాహనాల రాకపోకలు...

అసలే ఇరుకుగా ఉన్న ఈ దారి గుండా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బండ్లగూడ ముఖ్యకూడలి నుంచి నలు వైపులా వెళ్లే భారీ వాహనాలు, బస్సులు, లారీలు ఇతర పెద్ద వాహనాలు మలుపు తిప్పడం కష్టంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు వారాంతపు సంతలు సైతం ప్రధాన రహదారులపై నిర్వహిస్తుండటంతో రద్దీతోపాటు సమస్యలూ మరింత పెరిగాయి. ఇకనైనా ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు త్వరలో రోడ్డు విస్తరణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పెరుగుతున్న వాహనాలు.. భారీగా ట్రాఫిక్ జామ్...

విస్తరిస్తున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెరుగుతున్న వెహికిల్ లోడ్, ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా రహదారులను విస్తరించాల్సి ఉంది. అందుకు తగినట్లు నాలుగు సంవత్సరాల క్రితమే హెచ్ఎండీఏ అధికారులు అవసరమైన రవాణా వ్యవస్థలపై అధ్యయనం చేశారు. అవికాస్తా అమలు చేయకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రంగా మారుతున్నాయి.

గతంలోనే 100 ఫీట్ల రోడ్డుకు అనుమతులు...

గత ప్రభుత్వ హయాంలో కిస్మత్‌పూర్ నుంచి బండ్లగూడ చౌరస్తా వరకు, పర్మాయిస్ హోటల్ నుంచి కేంద్రీయ విహార్ వరకు 100 ఫీట్లమేర లింక్ రోడ్లను నిర్మించేందుకు హెచ్ఎండీఏ నుంచి అనుమతులు కూడా లభించాయి. అధికారులు రోడ్డు విస్తరణకు మార్కింగ్ పూర్తి చేసినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో వంద ఫీట్ల రోడ్డు కలగానే మిగిలిపోవడం తద్వారా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం సాధారణమైంది.

విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు, పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లు...

- కాలక్రమేణా స్థానికంగా గణనీయమైన మార్పులొచ్చాయి. రహదారులు కొంతమేర అందుబాటులోకి వచ్చినా రోడ్డెక్కామంటే ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కోక తప్పదు.
- కిస్మత్‌పూర్, హైదర్షాకోట్, దర్గా ఖలీజ్ ఖాన్, గంధంగూడ, బండ్లగూడ, బైరాగిగూడ, పీరం చెరువు, హిమాయత్‌సాగర్ తదితర ప్రాంతాల్లో గృహ సముదాయాలు, పెద్దపెద్ద విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌లు భారీగా వెలిశాయి. కార్పొరేషన్ పరిధిలో 196 కాలనీలు ఏర్పడగా, 35,565కుపైగా నివాస గృహాలు ఉన్నాయి. 1.80 లక్షల మంది జనాభా ఉంటున్న అనధికార సమాచాన్ని బట్టి తెలుస్తోంది.


బండ్లగూడ నుంచి కిస్మత్‌పూర్ వెళ్లే రహదారిపై వాహనాల రద్దీ

ఏజీవర్సిటీలో అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ


సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీసీ

ఏజీవర్సిటీ: విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వీసీ జానయ్య సిబ్బందితో అవినీతికి వ్యతిరేకంగా సోమవారం ప్రతిజ్ఞ చేయించారు. పరిపాలన భవనంలో బోధన, బోధనేతర సిబ్బందితోపాటు ఔట్ సోర్సింగ్ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ అవినీతిపై పోరాటం చేయాలని ఈ సందర్భంగా వీసీ సూచించారు. అవినీతికి పాల్పడటమే కాకుండా అవినీతిని ప్రోత్సహించడం కూడా తప్పే అని ఆయన స్పష్టం చేశారు.

సదర్‌కు హాజరుకావాలని స్పీకర్‌కు ఆహ్వానం


స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు సదర్ కార్యక్రమానికి హాజరు కావాలని సంఘం సభ్యులు సోమవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మజ్జిగ నరేశ్ యాదవ్ బుద్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ... సదర్ కార్యక్రమానికి హాజరు కావాలని ప్రజా ప్రతినిధులతో పాటు పలువురు ముఖ్యులకు ఆహ్వాన పత్రాలను అందజేశామన్నారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు సదర్ కార్యక్రమాన్ని బుద్వేల్ శివాలయం చౌరస్తాలో నిర్వహిస్తామన్నారు. యాదవ సోదరులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ధర్నా



శంషాబాద్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు స్కాలర్‌షిప్ మొత్తాన్ని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.వై.ప్రణయ్ డిమాండ్ చేశారు. ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులతో పాటు ఉపకార వేతనాలు కోసం సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణయ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల కళాశాల యజమానులు విద్యాసంస్థలను మూసివేస్తామని హెచ్చరిస్తున్నా సర్కారు పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖ మంత్రి లేని తెలంగాణ ప్రభుత్వం విద్యావ్యవస్థను గాలికొదిలేసిందన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష, సతీష్, స్పందన, సోనాలి, ప్రవళిక, తరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల కేంద్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్ రావు, టీపీయూఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కాశీరావు కోరారు. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్ మండల తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయుల ఆర్థిక విషయాలు, 4 డీఏలు విడుదల చేయాలన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. పీఆర్సీ కమిటీ నివేదికను వేగవంతం చేసి త్వరితగతిన అమలు చేయాలన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించకుంటే మహాధర్నా నిర్వహిస్తామన్నారు. మండల బాధ్యులు బాలకృష్ణ మదగాని, అనిల్, బాలకృష్ణ, టీపీయూఎస్ సభ్యులు పాల్గొన్నారు.

సీబీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) సహాయ ప్రొఫెసర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి డాక్టరేట్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఘట్‌కేసర్‌లోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూలో సీఎస్‌ఈ విభాగ ప్రొఫెసర్ ఎం.చంద్రమోహన్ పర్యవేక్షణలో పరిశోధన చేశానన్నారు. మొబైల్ అడాక్ నెట్‌వర్క్‌లలో అడాప్టివ్ ట్రస్ట్ అప్రోచ్ ఉపయోగించి సురక్షిత మార్గాలు, నోడ్‌లను గుర్తించటం, తొలగించటం, మూలం, గమ్యస్థానం మధ్య డేటా ట్రాన్స్‌మిషన్ కోసం శక్తి సమర్థవంతమైన విశ్వసనీయమైన సురక్షిత మార్గాన్ని కనుగొనే విభాగంలో పరిశోధన చేసిన తనకు డాక్టరేట్ లభించిందని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో సోమవారం సీబీఐటీ కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, అధ్యాపకులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.

నేడు 'మనూ'లో వాక్ ఇన్ అడ్మిషన్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఇండస్ట్రియల్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్(ఐటీఐ)లో మంగళవారం వాక్ ఇన్ అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ తెలిపారు. మంగళవారం ఉదయం 'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ భవనంలో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్), ఎలక్ట్రీషియన్, ఎల్క్ట్రానిక్స్ అండ్ మెకానిక్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్, ప్లంబర్ కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆమె వివరించారు. వివరాలకు 040-23008428, 9440692452లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

నెమలినగర్ సమస్యలు పరిష్కరించండి


నెమలినగర్‌లో సమస్యలు తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: సమస్య వలయంలో నెమలినగర్ వాసులు కొట్టుమిట్టాడుతున్నారని ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు డి.సీతారాం డిమాండ్ చేశారు. సోమవారం మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడలోని నెమలినగర్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం క్వార్టర్స్‌లలో పార్టీ నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తోందని, పలు ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం లేదన్నారు. చాలా చోట్ల విద్యుత్ వైర్లు వేలాడుతుండటం, గోతుల మయంగా రోడ్లు, మరమ్మతులకు నోచుకోని జేఎన్ఎన్‌యూఆర్ఎం క్వార్టర్స్, రోడ్ల పక్కనే ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయన్నారు. ప్రారంభోత్సవానికి నోచుకోని బస్తీ దవాఖానా లాంటి అనేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్ కాలనీలో పర్యటించిన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ విషయాన్ని త్వరలోనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి గుట్టమీది నరేందర్, కౌన్సిలర్ నవీన్‌కుమార్, నాయకులు జి.విఠల్, మల్లేష్, ప్రకాశ్, ఎ.లక్ష్మణ్‌రావు, రామసుబ్బారెడ్డి, ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఆరిఫ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో భవిత బుగ్గి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న టీజీఏఎన్‌బీ డీఎస్పీ సుబ్బరామిరెడ్డి తదితరులు

- తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో డీఎస్పీ సుబ్బరామిరెడ్డి
- మాదకద్రవ్యాల అనర్థాలపై విద్యార్థులకు అవగాహన

మైలార్‌దేవ్‌పల్లి: మాదకద్రవ్యాలను సేవించడం అంటే విద్యార్థులు తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకోవడమే అని తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో (టీజీఏఎన్‌బీ) డీఎస్పీ సుబ్బరామిరెడ్డి హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై సోమవారం మహావీర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీజీఏఎన్‌బీ డీఎస్పీ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ... గంజాయి సేవించండం, సిగరెట్లు కాల్చడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతారన్నారు. అదికాస్తా అనేక అనర్థాలకు దారి తీస్తుందన్నారు. తమ పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు ఎంతో కష్టపడి కళాశాలకు పంపి వారిపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారన్నారు. తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకూడదని హితువు పలికారు. మంచి విద్యార్థులతో స్నేహం చేస్తే మంచి ఆలోచనలు వస్తాయని సూచించారు. సిగరెట్లు, గంజాయి తాగే స్నేహితుల వెంట తిరిగితే భవిష్యత్ నాశనం చేసుకున్నవారవుతారని గుర్తు చేశారు. కొంత మంది విద్యార్థులు డబ్బు సంపాదించడానికి సెల్‌ఫోన్‌ల చోరీలు, హత్యలు, తల్లిదండ్రులను హింసించడం, చంపడానికి కూడా వెనుకాడటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మంచి స్నేహితులతో తిరిగి సమాజానికి, దేశానికి ఉపయోగపడేలా ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చేలా ఎదగాలని కోరారు. రాజేంద్రనగర్ ఏసీపీ బాలాజీ మాట్లాడుతూ... విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు బైక్ కొనిపెడతారు కానీ కొంత మంది హెల్మెట్ పెట్టుకోకుండా వేగంగా వెళ్లి ప్రమాదాలకు గురవుతూ వికలాంగులుగా మారి కన్న వారికి భారంగా మారుతున్నారని అన్నారు. అలా చేయకుండా ప్రతి ఒక్క విద్యార్థి ట్రాఫిక్ నిబంధలను తప్పక పాటించాలని స్పష్టం చేశారు. టీజీఏఎన్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వీరేంద్ర పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ రెజ్లింగ్ పోటీలకు ప్రకాశ్‌సింగ్

- జాతీయ చాంపియన్‌లో సత్తాచాటిన వట్టినాగులపల్లివాసి
- ప్రపంచ ట్రయల్స్‌లో విజేతగా నిలిచిన ప్రకాశ్‌సింగ్


ప్రపంచ చాంపియన్ ట్రయల్స్‌లో విజేతగా నిలిచిన ప్రకాశ్‌సింగ్ (ఫైల్)

మణికొండ: రష్యాలోని కజాన్ నగరంలో నవంబర్ 10వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరిగే ప్రపంచ బెల్ట్ రెజ్లింగ్ చాంపియన్ షిప్-2024 పోటీలకు నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన రెజ్లర్ ప్రకాశ్‌సింగ్ ఎన్నికయ్యారు. ఈ నెల 3వ తేదీన ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ చాంపియన్‌షిప్ పోటీలలో 90 కేజీల విభాగంలో అతను సత్తాచాటి విజేతగా నిలిచారు. ఈ నెల 6వ తేదీన డెహ్రాడూన్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్ ట్రయల్స్ పోటీలలోను సత్తాచాటారు. దాంతో ఆయనను రష్యాలో జరిగే ప్రపంచ బెల్ట్ రెజ్లింగ్ పోటీలకు ఆల్ ఇండియా ట్రెడిషనల్ రెజ్లింగ్ ఫెడరేషన్ వారు ఎంపిక చేశారు. నవంబర్ 9వ తేదీన పోటీలలో పాల్గొనేందుకు బయలుదేరేందుకు సిద్ధంగా ఉండాలని తనకు సోమవారం సదరు సంస్థ లేఖ పంపిందని ప్రకాశ్‌సింగ్ తెలిపారు. తన జీవితాశయమైన ప్రపంచ చాంపియన్ షిప్‌ను గెలిచి సత్తా చాటుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. స్థానిక నుంచి జాతీయ స్థాయి వరకు అనేక పథకాలను సాధించి ఉత్తమ రెజ్లర్‌గా అతను పలువురి ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం ప్రపంచ చాంపియన్ షిప్‌కు ఎన్నిక కావటంతో నార్సింగి మున్సిపాలిటీతో పాటు వట్టినాగులపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ రెజ్లింగ్ గెలిచి తమ గ్రామానికి పేరు తేవాలని వారు ఆకాంక్షించారు.

నేషనల్ సైన్స్ ఫెయిర్‌లో మోడల్ స్కూల్ విద్యార్థులు

రాయదుర్గం: జాతీయ సైన్స్ ఫెయిర్‌లో మనూ మోడల్ స్కూల్ విద్యార్థులు రాణించారు. చెన్నయ్‌లోని పూనమల్లిలోని సనా మోడల్ స్కూల్‌లో నిర్వహించిన 17వ జాతీయ సైన్స్ ఫెయిర్‌లో 'మనూ' మోడల్ స్కూల్ మూడవ స్థానంలో నిలిచింది. సాదియా బేగం, మీర్జ్ జోయాబేగంలు లైఫ్ సైన్సెస్ విభాగంలో 'వరి, గోధుమ విత్తనాల అంకురోత్పత్తి, విత్తనాల పారామితులపై యూవీ-సి రేడియేషన్ ప్రభావం' అనే అంశంపై ప్రాజెక్టును సమర్పించారు.ఈ సందర్భంగా వారికి మెమెంటో, ప్రశంసా పత్రాన్ని అందించారు.

ఆర్ఎంసీ ప్లాంట్లను తొలగించండి

మణికొండ: రాత్రి, పగలు అనే తేడా లేకుండా రణగొణ ధ్వనులు, వాహనాల శబ్దాలతో నిద్దుర లేకుండా చేయటంతో పాటు వాతావరణ కాలుష్యానికి కారణం అవుతున్న రెడీమిక్స్ ప్లాంట్లు, క్రషర్ మిషన్‌లను తొలగించేలా చర్యలు చేపట్టాలని వాటి బాధితులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. సోమవారం ఆయన నివాసంలో మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల శివారులోని మైహోం అవతార్, హాల్‌మార్క్ వినినియా గేటెడ్ కమ్యూనిటీలవాసులు వినతి పత్రం అందజేశారు. తమ గేటెడ్ కమ్యూనిటీల పక్కనే ఉన్న రెడీమిక్స్ ప్లాంట్లతో అనేక రోగాల బారిన పడుతున్నామన్నారు. మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న నివాసితులు

'రీ కౌంటింగ్ చేయాలి'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికలలో అధ్యక్ష పదవి ఓట్ల లెక్కింపుపై అధికార యంత్రాంగం తర్జన భర్జన పడుతున్నారు. సోమవారం హెచ్‌సీయూ గ్రీవెన్స్‌సెల్, ఎన్నికల కమిటీ క్యాంపస్‌లో సమావేశమయ్యారు. కాగా అధ్యక్షుని గెలుపుపై హెచ్‌సీయూ నుంచి అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. అయితే అధ్యక్ష పదవి ఓట్ల లెక్కింపు పారదర్శకంగా సాగలేదని రీకౌంటింగ్ చేయాలని ఇండిపెండెంట్ అభ్యర్థి ఆకాశ్‌భాటి డిమాండ్ చేస్తున్నారు.

గచ్చిబౌలిలో ఈఆర్ఓ ఆఫీస్ ఏర్పాటు చేయాలని వినతి

రాయదుర్గం: విద్యుత్‌శాఖ గచ్చిబౌలి డివిజన్ కార్యాలయ పరిధిలో ఎలక్ట్రికల్ రెవెన్యూ ఆఫీస్ (ఈఆర్ఓ)ను ఏర్పాటు చేయాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టోలిచౌకీలోని తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌కు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. శేరిలింగంపల్లి మండలం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం అని అన్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో అత్యధిక వినియోగదారులు కలిగిన డివిజన్ అని విద్యుత్ బిల్లులలో తేడాలు వస్తే కూకట్‌పల్లి వరకు వెళ్ళాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి ప్రస్తుతం మేడ్చల్ జిల్లా పరిధిలో ఉందని, వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అత్యధిక వినియోగదారులు కలిగిన చందానగర్ ప్రాంతంలో ఈఆర్ఓ ఆఫీస్‌ను ఏర్పాటు చేసినట్లయితే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. అధికారులు స్పందించి ఈఆర్ఓ ఆఫీస్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

నూనె గింజల సాగు పెంచాలి



ఐసీఏఆర్ డీడీజీ డాక్టర్ టీఆర్ శర్మ

ఏజీ వర్సిటీ: వివిధ రకాల నూనెలను దిగుబడిని తగ్గించేందుకు దేశవ్యాప్తంగా నూనె గింజల సాగును భారీగా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని జాతీయ నూనె గింజల పరిశోధన సంస్థ డీడీజీ డాక్టర్ టి.ఆర్.శర్మ (న్యూ ఢిల్లీ) అన్నారు. సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జాతీయ నూనెగింజల పరిశోధనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన అవిసెలు, కుసుమ పంటలపై పరిశోధనలు చేస్తున్న 150 మంది ప్రముఖ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు. వీరు నూనె గింజల సాగును పెంచేందుకు చేపట్టనున్న భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ముళ్లు లేని కుసుమ రకాలను వృద్ధి చేయాలని సూచించారు. అన్ని పరిశోధన సంస్థలు సంయుక్తంగా పరిశోధనలు చేయడం వల్ల కుసుమ, అవిసెలలో చాలా నూతన రకాలను వృద్ధి చేయడం జరిగిందని వారు వివరించారు. ఐఐఓఆర్ డైరెక్టర్ డాక్టర్ మాధూర్ మాట్లాడుతూ... గత సంవత్సరం కుసుమ, అవిసెలలో చేపట్టిన పరిశోధన ఫలితాలను క్లుప్తంగా వివరించారు. నూతన వండగాల గురించి వివరించారు. డీన్ అగ్రికల్చర్ సత్యనారాయణ మాట్లాడుతూ... పీజేటీఏఎస్ వ్యవసాయ విశ్వవిద్యాలయం చాలా వరకు కుసుమ సాగును ప్రోత్సహిస్తే రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. చీడ పీడలను తట్టుకునే రకాలను విశ్వవిద్యాలయంలో వృద్ధి చేయడమే కాకుండా కుసుమ నూనె కూడా ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా అవిసె, కుసుమ పంటలను పెద్ద మొత్తంలో సాగు చేస్తున్న రైతులను సన్మానించారు.

నిర్మాణరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్



మైలార్‌దేవ్‌పల్లి: భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ పథకాల పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కార్యదర్శి చంద్రమోహన్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం తెలంగాణ బిల్డింగ్-అదర్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో కాటేదాన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భవన నిర్మాణ ఆన్‌లైన్ సేవలు నాలుగు నెలలుగా రావడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ బడ్జెట్‌ను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ మంత్రిని వెంటనే నియమించాలని కోరారు. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేసి, కార్మికుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. కార్మికులకు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు జీయం కురుమయ్య, ఎస్.రామ్‌మోహన్, చైతన్య, పార్వతి, ముస్తాఫా, సంతోష్ కుమార్, శంకర్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డులో సంత వద్దు

- జీహెచ్ఎంసీ అధికారుల ఆదేశాలు
- మా పొట్టకొట్టొంద్దంటున్న కూరగాయల వ్యాపారులు
- ఖాజాగూడలో సంత నిర్వహణకు స్థలం చూపాలని స్థానికుల డిమాండ్



రాయదుర్గం: నేడు ఆన్‌లైన్ ఆర్డర్లు పెరిగినా సంతల ప్రాముఖ్యత తగ్గలేదు. ఏళ్లుగా గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో ప్రధాన రహదారి పక్కన మంగళవారం సంత జరుగుతుంది. ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులు ప్రధానరోడ్డులో సంత నిర్వహించరాదంటూ ఆదేశాలు జారీ చేయడంతో నేడు మంగళవారం సంత నిర్వహించాలా ?వద్దా..? తర్జనభర్జన జరుగుతోంది. ప్రతి మంగళవారం ఉదయం పది గంటల నుంచి కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, ఇతర వస్తువులు, దుస్తులు రకరకాలను అందుబాటులో ఉంచడంతో పేద, సామాన్య మధ్యతరగతి వారే కాకుండా ఉద్యోగులు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీవాసులు సైతం ఈ సంతలకు వస్తున్నారు. కాగా సంతను కొనసాగించాలని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా సంత నిర్వహణకు అనువైన చోటును కేటాయించా లని కూరగాయల వ్యాపారులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఖాజాగూడలో అంతర్గత రోడ్లపై సంతను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.